సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



ఉపాధి కోసం వస్తే.. ఊపిరి ఆగింది

సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామంలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళా కూలీలు మృత్యువాత పడ్డారు. మరో ఏడుగురు అపస్మారక స్థితిలో ఉన్నారు. - 10లో



మహిళపై టీడీపీ వర్గీయుల దాడి

ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికినందుకు ఓ మహిళపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి జరిగింది. - 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.800	రూ.860
రెండోరకం	రూ.600	రూ.780



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 249 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	470	470
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 159.860 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ఉద్యోగ మేళా

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్నమయ్య జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేయుటకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి 18 నుండి 34 సంవత్సరాలలోపు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికయిన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుండి రూ.25 వేల వరకు హోదాను బట్టి వేతనం ఇస్తారన్నారు. విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫోటోలతో ఉద్యోగమేళాకు హాజరు కావచ్చునని ఆయన తెలియజేశారు. ఆద్య హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో జూనియర్ టెక్నీషియన్ ఉద్యోగానికి, ముత్తూట్ ఫైనాన్స్‌లో జూనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, ఇన్నోవ్ సోర్స్(ఎస్‌బీఐ కార్డ్స్) కంపెనీలో టెలీకాలర్స్, టీంలీడర్, బీఆర్‌ఈ (ఇన్‌సైడ్ బ్యాంక్), యంగ్ ఇండియా కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు మేళా నిర్వహిస్తారన్నారు.

నవోదయ 9,11 తరగతులకు దరఖాస్తు చేసుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

మదనపల్లె సిటీ : స్థానిక వలసపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025 సంవత్సరానికి 9, 11 తరగతుల ప్రవేశానికి ఆన్‌లైన్ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయ సమితి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేలాయుధన్ తెలిపారు. సోమవారం విద్యాలయంలో ప్రవేశ పరీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 30వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు లక్ష్మినారాయణ పీజీటీ 89199 56395, జగదీష్‌కుమార్ పీజీటీ 70132 01138ను సంప్రదించాలని కోరారు.

బాధితులకు సత్వర న్యాయం



ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే సమగ్ర విచారణ చేపట్టి న్యాయం అందేలా చూడాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు. రాయచోటిలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని విచారించి న్యాయం అందించడానికి అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ సిద్ధంగా ఉంటుందన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విని న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

ఖబడ్దార్!







- మద్యం షాపులకు దరఖాస్తు చేసే వారికి వార్నింగ్ ఇస్తున్న 'పచ్చ నేతలు'
- దరఖాస్తు చేయడానికి భయపడుతున్న వ్యాపారులు
- కడపలో హెచ్చరికలు చేస్తున్న 'ఆ నలుగురు'
- నిరభ్యంతరంగా దరఖాస్తు చేసుకోవాలని కోరుతున్న ఎక్సైజ్‌శాఖ

సాక్షి ప్రతినిధి, కడప : ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చింది. దరఖాస్తులతోనే గణనీయ ఆదాయం గడించాలనే ఎత్తుగడ ఎంచుకుంది. అదే అధికారాన్ని అడ్డుపెట్టుకొని టీడీపీ నేతలు ప్రభుత్వ అంచనాలనే తారుమారు చేస్తున్నారు. మద్యం వ్యాపారులపై బెదిరింపులకు దిగుతున్నారు. లాటరీలో మద్యం షాపు దక్కినా, నిర్వహణ సాధ్యం కాదనే సంకేతాన్ని ఇస్తున్నారు. ఫలితంగా దరఖాస్తులు చేయాలనుకునే వారు ఎందుకొచ్చిన గొడవ అన్నట్లు మిన్నకుండి పోతున్నారు. సిండి'కేటుగాళ్ల'కారణంగా దరఖాస్తుల స్వీకరణ అంచనాలు తారుమారయ్యాయి.

వైఎస్సార్ జిల్లాలో 139, అన్నమయ్య జిల్లాలో 111మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలయ్యింది. దరఖాస్తు స్వీకరణకు అక్టోబర్ 9వతేది సాయంత్రం 5గంటల వరకూ తుది గడువు విధించారు. సోమవారం సాయంత్రం 5గంటల వరకూ వైఎస్సార్ జిల్లాలో 789 దరఖాస్తులు, అన్నమయ్య జిల్లాలో దాదాపు 600 దరఖాస్తులు లభించాయి. ఒక్కో మద్యం షాపునకు సరాసరిగా 30 దరఖాస్తులకు తక్కువ లేకుండా లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. కనీసం సరాసరిగా 20 దరఖాస్తులకు తక్కువ కాకుండా వస్తాయని ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేశారు. రెండు జిల్లాలో 250 మద్యం షాపులకు కనీసమన్నా 5వేలు దరఖాస్తులు లభిస్తాయని, తద్వారా దరఖాస్తు ఫీజు రూపేనా రూ.100కోట్లు లభిస్తోందని అంచనాలో ఉన్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుకు ఇక రెండు రోజులే గడువు ఉంది. ఇప్పటి వరకూ 14వందలకు మించి దరఖాస్తులు లభించలేదు. కాగా, ప్రభుత్వ అంచనాలను తెలుగుతమ్ముళ్లే తూట్లు పొడుస్తున్నారు. అదే విషయాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

కడపలో చక్రం తిప్పుతున్న ఆ నలుగురు...

కడప కార్పొరేషన్ పరిధిలో 21 మద్యం షాపులకు టెండర్లు ఆహ్వానించారు. కాగా, జిల్లా కేంద్రమైన కడపలో టీడీపీ నేతలకే మద్యం షాపులు దక్కాలనే దిశగా ఆ నలుగురు అడుగులు వేస్తున్నారు. ఈక్రమంలో తెరముందుకు పాతకడప మాజీ సర్పంచ్, చిన్నచౌక్ ప్రాంతానికి చెందిన ఓనేత, మరో మద్యం వ్యాపారి, ఎమ్మెల్యే వెంట ఎప్పుడూ ఉండే మరో నాయకుడు జట్టుకట్టారు. మద్యం షాపుల దరఖాస్తు చేసుకోవాలనుకునే వారిని పసిగట్టి మరీ ఫోన్లు చేస్తున్నారు. మీరెవ్వరూ దరఖాస్తులు చేయరాదంటూ హుకుం ప్రదర్శిస్తున్నారు. కాదు, కూడదంటే అన్నతో మాట్లాడాలంటూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి పేరును వాడుతుండడం గమనార్హం. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి నిరభ్యంతరంగా మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవచ్చని స్టేట్‌మెంట్ ఇవ్వకపోవడం కూడా ఆ నలుగురి వాదనకు బలం చేకూరుతోంది.

▶▶ పీలేరులో అదే పరిస్థితి..

అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గంలో 18మద్యం షాపులకు నోటిఫికేషన్ విడుదలైంది. మద్యం షాపులన్నీ తమ అనుచరులకే కావాలంటూ ఓ ప్రజాప్రతినిధి రంగప్రవేశం చేసినట్లు సమాచారం. మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారికి స్వయంగా ఫోన్లు చేస్తూ దరఖాస్తు చేయరాదంటూ హెచ్చరికలు చేస్తున్నట్లు సమాచారం. ఎప్పటి నుంచో ఉన్న అనుచరులకు వెసులుబాటు కల్పించాలి, మీరు పోటీకి రావద్దని కొందరికి నయంగా, మరి కొందర్ని బెదిరిస్తూ కట్టడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

కమలాపురంలోనూ హెచ్చరికలు

కమలాపురం నియోజకవర్గంలో 13మద్యం షాపులకు టెండర్లు పిలిచారు. ఎవరూ దరఖాస్తులు చేయరాదంటూ అధికారపార్టీకి చెందిన ముఖ్యనేత హుకుం జారీ చేశారు. స్వయంగా కొందరు టీడీపీ నేతలే విన్నవిస్తున్నా మద్యం షాపుల జోలికి వెళ్లద్దంటూ హెచ్చరికలు చేసినట్లు సమాచారం. టీడీపీ విజయం కోసం పనిచేసినా నిరుపయోగమే అయ్యిందని వీరపునాయనిపల్లెకు చెందిన ఓ టీడీపీ కార్యకర్త తన సన్నిహితుల వద్ద ఈవిషయమై వాపోయినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం టీడీపీ కార్యకర్తల కోసమే మద్యం పాలసీ తీసుకొస్తే నాయకులే ఏకపక్షంగా దక్కించుకునే ఎత్తుగడలో ఉన్నారని, మద్యం షాపులన్నీ వారికే కావాలంటూ, ఎవ్వరినీ దరఖాస్తు చేయవద్దంటున్నారని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.

పారదర్శకంగా మద్యం టెండర్లు



మద్యం పాలసీ అత్యంత పారదర్శకంగా అమలు చేస్తాం. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించే వెసులుబాటు కల్పించింది. 9వ తేది సాయంత్రం 5గంటల లోపు వచ్చే దరఖాస్తులన్నీ స్వీకరిస్తాం. దరఖాస్తుదారులు, కలెక్టర్ సమక్షంలో 11వతేది జెడ్పీ మీటింగ్ హాల్‌లో లాటరీ తీస్తాం. లాటరీ వ్యవహారమంతా వీడియో రికార్డింగ్ కూడా చేపట్టనున్నాం. అత్యంత పారదర్శకంగా టెండర్ ప్రక్రియ కొనసాగించనున్నాం. మద్యం వ్యాపారులు అనువైన ప్రాంతాలల్లో నిరభ్యంతరంగా దరఖాస్తులు చేసుకోవచ్చు.

– ఎక్సైజ్‌శాఖ డీసీ జయరాజు

తిరుమల గరుడ సేవలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : తిరుమల బ్రహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జరిగే గరుడ సేవకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి రాము అన్నారు. సోమవారం ఆయన ఆర్టీసీ టు డిపోను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండు, హోటళ్లు, షాపులను పరిశీలించారు. టు డిపోలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వన్,టు డిపోల నుంచి 20 అదనపు బస్సులు గరుడ సేవకు ప్రత్యేక బస్సులు తిప్పనున్నట్లు తెలిపారు. గాలివీడు, కందూరు, రామసముద్రం, శ్రీశైలం రూట్ బస్సుల్లో ఆదాయం పెంచాలన్నారు. కొత్త సూపర్ లగ్జరీ బస్సులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చాయన్నారు. విజయవాడ, హైదరాబాదులకు నడపనున్నట్లు తెలిపారు. కార్గో ఆదాయం పెంచాలన్నారు. వన్‌డిపో కెఎంపిఎల్, ఈపీకె బాగా ఉన్నాయన్నారు. సమావేశంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, సీఐలు రేవతి, గీత, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధించి ఎప్పటికప్పుడు అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని చెప్పారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ సత్యనారాయణరావు, ఆర్డీఓ రంగస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ ఎస్ఓగా శివకుమార్

బి.కొత్తకోట : మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ సెక్షన్ ఆఫీసర్‌గా అడపా శివకుమార్ నియమితులయ్యారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయనకు ఇక్కడ అదనపు బాధ్యతలు అప్పగించారు. బదిలీల్లో భాగంగా బంగారుపాళ్యం నుంచి హార్సిలీహిల్స్‌కు బదిలీ చేయడంతో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సలహాలు ఇవ్వండి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందడంపై సమీక్షిస్తున్న జిలా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో స్వర్ణాంధ్ర–2047 జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా రాబోయే ఐదు సంవత్సరాల వరకు జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి గల అంశాలు, అవకాశాలు, తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్రస్థాయిలో మన జిల్లా నుంచి ఇప్పటికే వివిధ వర్గాలకు చెందిన దాదాపు 1.11 లక్షల మంది తమ ఆలోచనలు పంచుకున్నారని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా జిల్లాస్థాయిలో కూడా రూపొందిస్తామన్నారు. జిల్లాలో మైనింగ్, చక్కని మానవ వనరులు, ఉద్యాన పంటలు, అటవీ భూభాగం ఉన్నాయన్నారు. అన్నమయ్య జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయడంలో మీవైపు నుంచి మీ ఆలోచనలు, విలువైన సూచనలు, ప్రతిపాదనలు అందిస్తే వాటిని నివేదికలో పొందుపరిచి రాష్ట్రస్థాయికి పంపుతామని అన్నిశాఖల అధికారులకు సూచించారు. మీ ఆలోచనలు, సలహాలు పంచుకునేందుకు రాబోయే రెండు రోజులే చివరి అవకాశమన్నారు. అనంతరం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకట పెద్దయ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్వర్ణాంధ్ర – 2047 విజన్ ప్రణాళిక ప్రధాన ఉద్దేశంపై అవగాహన కల్పించారు.

డీఎఫ్ఓ వివేక్ సేవలు మరువలేనివి

బదిలీపై వెళ్తున్న డీఎఫ్ఓ వివేక్‌ను కలెక్టర్ శ్రీధర్ తోపాటు పలువురు అధికారులు సన్మానించారు. కలెక్టర్, జేసీ, డీఆర్ఓ, సబ్ కలెక్టర్లు, డీఆర్ఓ, అధికారులు డీఎఫ్ఓ సేవలను కొనియాడారు.

జిల్లాలో మరో మూడు ఇసుక రీచ్‌లు

– వెబ్ పోర్టల్ లేదా సచివాలయాలలో ఉచిత ఇసుక కోసం దరఖాస్తు చేసుకోవచ్చు

అన్నమయ్య జిల్లాలో ఉచిత ఇసుక కోసం ఏపీ సాండ్ మేనేజ్‌మెంట్ వెబ్ పోర్టల్ లేదా సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ ఛాంబర్‌లో అన్నమయ్య జిల్లాలో అమలవుతున్న ఇసుక పాలసీ, ఇసుక రవాణా, ఇసుక కోసం దరఖాస్తు చేసుకునే విధానం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు మూడు ఇసుక రీచ్‌లు ఉన్నాయని, మరో మూడు రీచ్‌లను అక్టోబర్ 16వ తేదీ కల్లా అందుబాటులోకి తేనున్నామన్నారు. ఆదివారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఏడీ మైన్స్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి బంగారు రథం

ఉత్సవాల వేళ.. ఉట్టిపడుతున్న కళ

ఆ ఆలయం ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకం.. నిలువెత్తు ఆలయ గోపురం పట్టణానికే తలమానికం.. అదే ప్రొద్దుటూరులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం. దసరా ఉత్సవాలకు రెండో మైసూరుగా ఖ్యాతిగాంచిన పసిడిపురి వెలిగిపోతోంది. జిల్లా వ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తజనంతో కళకళలాడుతోంది. దసరా నేపథ్యంలో 'అమ్మవారి వైభవం'పై ప్రత్యేక కథనం.

- వాసవీ మాతకు ఆధ్యాత్మిక వైభవం
- కన్యకాపరమేశ్వరికి వజ్రపుచీర, కిరీటం, బంగారు రథ సేవ..
- పట్టణానికే తలమానికంగా విరాజిల్లుతున్న అమ్మవారిశాల

ప్రొద్దుటూరు కల్చరల్ : దసరా అంటేనే గుర్తుకు వచ్చేది ప్రొద్దుటూరు శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్నాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడ నిర్వహించే దేవీనవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొంటారు. మైసూరు తర్వాత దసరా వేడుకలకు ప్రొద్దుటూరు ఖ్యాతిగాంచింది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో 134 ఏళ్లుగా ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సుందరంగా నిర్మించిన ఈ ఆలయ గోపురం పట్టణానికే చిహ్నంగా మారింది. ఈ ఆలయం ఆధ్యాత్మిక చింతనకు, ప్రశాంతతకు నిలయం. ఆర్యవైశ్యులతోపాటు అన్ని కులాలు, మతాల భక్తులు అమ్మవారిని దర్శించి పూజలు చేస్తుంటారు. ఆలయ గర్భగుడి లోపల గ్రానైట్, మార్బుల్ రాళ్లతో మనోహరంగా తీర్చిదిద్దారు. గర్భగుడికి వెండి తొడుగులను ఏర్పాటు చేశారు. అమ్మవారికి అద్దాల మండపం ఉంది. దీంతో ఎటు వైపు చూసిన అమ్మవారు దర్శనమిస్తారు.

రోజూ ప్రత్యేక పూజలు

వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి రోజూ విశేష అభిషేకాలు, అర్చనలతోపాటు లోక కల్యాణార్థం వాసవీ నిత్యహోమాన్ని చేస్తుంటారు. అమ్మవారికి ఏ ఆలయంలోలేని విధంగా పుత్తడి ఆభరణములు, పాశాంకుశాలు, వజ్రపు చీరె, కిరీటం, బంగారు చీరెలలో విశేష పర్వదినాల్లో దర్శనమిస్తారు. ఇక అమ్మవారికి పాయసాన్ని బంగారు పాత్రలో నివేదిస్తారు. అలాగే స్వర్ణపాత్రలో అమ్మవారి పాదాల చెంత ఉంచిన బంగారు పాత్రలో ఉంచిన తీర్థాన్ని మరుసటి రోజు భక్తులకు తీర్థంగా పంపిణీ చేస్తారు. దీని వల్ల భక్తులకు రోగాలు నయమౌతాయని ప్రతీతి. మంగళవారం, శుక్రవారం సాయంత్రం స్వర్ణశ్రీచక్ర మేరువుకు పూజా నిర్వహిస్తున్నారు. వీటితోపాటు విశేషంగా ప్రతి సోమవారం సాయంత్రం గజవాహన సేవ, మంగళవారం సాయంత్రం సువర్ణ రజిత అష్టదళ పద్మపూజసేవ, బుధవారం వెండి ఊయలసేవ, గురువారం స్వర్ణరథ సేవ, శుక్రవారం పల్లకిసేవ, శనివారం వెండి సింహాసనసేవ, ఆదివారం ఉదయం గో క్షీరంతో అభిషేకం, సాయంత్రం స్వర్ణరథసేవ నిర్వహిస్తారు. ఇక విజయదశమి నాడు వాసవాంబ పంచలోహ రథంలో భక్తులను కరుణిస్తారు.



విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారిశాల

అమ్మవారిశాల కీర్తిని విశ్వవ్యాపితం చేస్తాం



ప్రొద్దుటూరులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి కీర్తిని విశ్వవ్యాపితం చేస్తాం. గతంలో అమ్మవారికి నిత్యపూజా కార్యక్రమాలు జరిగేవి. 2004 తరువాత అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలతో పాటు నిత్య సేవలు ప్రారంభించాం. అమ్మవారికి బంగారు రథం సేవ, గజవాహన సేవ, వెండి ఊయలసేవ ఇలా రోజూ ఒక్కో సేవను నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం 134వ దసరా ఉత్సవాలను నిత్యనూతనంగా నిర్వహిస్తున్నాం. భక్తులు పాల్గొని అమ్మవారి అలంకారాలను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలి.

– బుశెట్టి రాంమోహన్‌రావు, ఆర్యవైశ్యసభ సభ అధ్యక్షుడు, ప్రొద్దుటూరు

లోకమాత.. జగజ్జననీ..

లోకమాత జగజ్జననీ అంటూ భక్తులు అమ్మవారిని శరణు వేడారు. దేవీ శరన్నవరాత్రులలో 5వ రోజైన సోమవారం తోటోత్సవం నిర్వహించారు. వనాన్ని తలపించేలా ఆలయాలను మొక్కలతో తీర్చిదిద్దారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో సాయంత్రం శ్రీదేవి వనవిహారినిగా, రాత్రి బిల్వవృక్ష నివాసిని పార్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వనం మధ్య పార్వతీ పరమేశ్వరులు, వన్యప్రాణులు, దేవతా మూర్తుల సెట్టింగ్ అందరిని ఆకట్టుకుంది. జిల్లాలోని అన్ని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది.

– ప్రొద్దుటూరు కల్చరల్





ఆలయంలో భక్తుల సందడి (ఇన్‌సెట్) అమ్మవారిశాలలో శ్రీదేవి వనవిహారిణి

క్లుప్తంగా

వానరానికి అంత్యక్రియలు

పెద్దమండ్యం : విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వానరానికి గ్రామస్తులు సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మండలంలోని పాపేపల్లెలో ఈ ఘటన చోటుచేసుకుంది. పల్లెలో గత కొన్ని రోజులుగా వానరాల గుంపు తిరుగుతోంది. ఈ క్రమంలో పల్లెలోని గంగమ్మ గుడి వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయి మృతి చెందింది. దీంతో గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా వానరాన్ని ఖననం చేశారు.

మహిళకు పాము కాటు


పాము కాటుతో చికిత్స పొందుతున్న మహిళ

కురబలకోట : మండలంలోని తెట్టు గ్రామం మండ్యంవారిపల్లెకు చెందిన ఆదెమ్మ సోమవారం పాముకాటుకు గురైంది. ఈమె పొలం వద్ద పాడి ఆవులకు గడ్డి కోస్తుండగా పాము కాటేసింది. హుటాహుటిన ఈమెను మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆటో - లారీ ఢీ


రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొండ్రెడ్డి

కలకడ : ఆటో–లారీ ఢీ కొన్న రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర రక్తగాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. పీలేరు నుంచి కలకడ వైపు వస్తున్న ఆటోను చీనీకాయల లోడుతో కలకడ నుంచి పీలేరు వైపు వెళుతున్న ఐచర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాలివీడుకు చెందిన శబరిష్ కొండ్రెడ్డికి ఎడమ కాలు విరిగి, చెవి నుంచి రక్తం రావడంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై సోమవారం కలకడ పోలీసులు కేసు నమోదు చేశారు.

మంటలంటుకుని వృద్ధురాలికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు లక్ష్మిదేవి

మదనపల్లె : ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్ల బైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీకి చెందిన వెంకటరమణ భార్య లక్ష్మిదేవి(65) కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఆమెను నివసిస్తున్న ఇంటి ఎదురుగానే మరో ఇంటిలో ఉంచారు. ఈ క్రమంలో లక్ష్మిదేవి తాను పడుకునే మంచం పై నుంచి, అగ్గిపెట్టెను వెలిగించే క్రమంలో పరుపునకు నిప్పు అంటుకుంది.నీ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. ఈ విషయం గమనించిన ఆమె మనవడు మంచం కాలిపోతోందంటూ గట్టిగా అరిచాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి బాధితురాలిని వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి కోసం వస్తే.. ఊపిరి ఆగింది

కుటుంబ పోషణ కోసం దినసరి కూలీలుగా మారి అలుపెరగని పోరాటం చేస్తున్న ఆ అభాగ్యులను పిడుగుపాటు రూపంలో మృత్యువు లాక్కెళ్లింది. మరో ఏడుగురు అపస్మారక స్థితిలో ఉన్నారు. ఈ విషాద సంఘటన సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామంలో చోటు చేసుకుంది. కూలీల స్వగ్రామమైన శెట్టిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

- పిడుగుపాటుకు తోడికోడళ్లు మృతి
- అపస్మారక స్థితిలో మరో తొమ్మిది మంది
- విషాదంలో శెట్టిపల్లె దిగువ దళితవాడ


శంకరమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు


పిడుగుపాటుకు మృతి చెందిన మల్లీశ్వరి


రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూలీలు

సంబేపల్లె : మండల పరిధిలోని ఎస్.సోమవరం గ్రామ సమీప పొలాల్లో సోమవారం ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. దీంతో శెట్టిపల్లె శంకరమ్మ(43), శెట్టిపల్లె మల్లీశ్వరి (40) అనే మహిళా కూలీలు మృతి చెందారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు శెట్టిపల్లె గ్రామం దిగువ హరిజనవాడకు చెందిన కూలీలు నిత్యం పనులకు వెళుతుండేవారు. ఈ క్రమంలో సోమవారం ఎస్.సోమవరం గ్రామంలో బావులకాడపల్లెకు చెందిన సిద్దయ్య పొలంలో టమాటా కాయలు కోసేందుకు వెళ్లారు. పొలంలో కాయలను గ్రేడింగ్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో శంకరమ్మ, మల్లీశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. వీరిద్దరూ తోడికోడళ్లు కావడం గమనార్హం. వీరితో పాటు పని చేస్తున్న తోటి కూలీలు యశోదమ్మ, కార్తీక్, జయమ్మ, రమణమ్మ, అలివేలమ్మ, సరస్వతి, రెడ్డెమ్మ, అమర్‌నాథ్, నాగమునెమ్మలు పిడుగుపాటుకు అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ, ఎంపీడీఓ రామచంద్ర, రెవెన్యూ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విషాదంలో హరిజనవాడ

రెక్కాడితే గానీ డొక్కాడని కూలీల కుటుంబాలను పిడుగుపాటు విషాదంలోకి నెట్టింది. వారందరూ ఒకే గ్రామస్తులు. అందులోను బంధువులు. మధ్యాహ్నం వరకు అందరితో కలిసి పని చేస్తున్న వారు ఒక్కసారిగా విగత జీవులు కావడంతో మిగిన వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న దృశ్యం అక్కడున్న వారిని కలచివేసింది. మృతులిద్దరూ తోడికోడళ్లు కావడం మరింత విషాదకరం.

పిడుగుపాటుపై రమేష్‌రెడ్డి దిగ్భ్రాంతి

రాయచోటి (జగదాంబసెంటర్) : సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామం బావులకాడపల్లెలో సోమవారం పిడుగు పాటుకు ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందిన సంఘటనపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం వీరి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం

రాయచోటి : పిడుగుపాటుకు గురై మృతిచెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిహారం ప్రకటించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో పొలం పనులు చేసుకుంటూ పిడుగుపడి చనిపోయిన శంకరమ్మ, మల్లీశ్వరి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యాధికారులను సీఎం ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామంలో పిడుగుపాటుకు గురై మృతి చెందిన శంకరమ్మ, మల్లీశ్వరి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శెట్టిపల్లె దిగువ హరిజనవాడకు చెందిన ఇద్దరు వ్యవసాయ కూలీలు మృతి చెందడం పట్ల శ్రీకాంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ఈ సంఘటనలో గాయపడిన వారికి ప్రభుత్వం మెరుగైన చికిత్స అందించాలని కోరారు. పిడుగు పడిన ప్రాంతాన్ని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి చిదంబరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, ఎస్.సోమవరం సర్పంచ్ అనసూయమ్మ తదితరులు సందర్శించి మృతులకు నివాళులు అర్పించారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి బాలుడి మృతి


మృతి చెందిన శ్యామ్

రాజంపేట : పట్టణంలోని పాతబస్టాండు సర్కిల్‌లో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఓ బాలుడు మృతి చెందాడు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం దంపతులకు పుత్రశోకాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళితే.. రైల్వేకోడూరు నియోజకవర్గం చిన్నఓరంపాడు కాలనీకి చెందిన బాబురావ్ , శిరీషాలకు పెద్దకుమారుడు శ్యామ్. బాలుని చికిత్స నిమిత్తం ద్విచక్రవాహనంలో రాజంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వచ్చారు. తిరుగు పయనంలో పాతబస్టాండు సర్కిల్ వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో బాలుడు గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. దంపతుల ఆర్తనాదాలు మిన్నంటాయి. బాలుడి మృతి ప్రతి ఒక్కరి కంట కన్నీరు పెట్టించింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీ కొని వృద్ధురాలు..


మృతి చెందిన చిన్నమ్మ

ములకలచెరువు : ఐచర్ వాహనం ఢీ కొనడంతో ఒక వృద్ధురాలు మృతి చెందిన సంఘటన సోమవారం తెల్లవారు జామున మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని వేపూరికోట పంచాయతీ గురికివారిపల్లెకు చెందిన చిన్నమ్మ (77) తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా మదనపల్లె వైపు వెళ్తున్న తమిళనాడుకు చెందిన ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో వృద్ధురాలు సంఘటన స్థలంలోనే మృతి చెందింది. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహా మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు రమణప్ప ఫిర్యాదు మేరకు ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు.

ట్రెజరీలో మాయగాడు!

- బంగారు నాణేలు మాయం
- నలుగురిపై సస్పెన్షన్ వేటు
- అటెండర్ అరెస్టు, నాణేలు రికవరీ


ట్రెజరీలోని స్ట్రాంగ్‌రూం

రాజంపేట : రాజంపేట ట్రెజరీలో ఉన్న పురాతన బంగారు నాణేలు, అప్పటి నగదు మాయమయ్యాయి. వీటిని అటెండర్‌గా పనిచేస్తున్న విష్ణువర్దన్‌రెడ్డి గుట్టు చప్పుడు కాకుండా ట్రెజరీలోని స్ట్రాంగ్ రూం సెల్‌లో నుంచి తరలించిన విషయం ఆల్యసంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 21న పురాతన నాణేలు కనిపించకపోవడంపై శాఖాపరంగా అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ అంతర్గత సమావేశం నిర్వహించుకున్నారు. ఎవరైనా తీసుకుని ఉంటే మాయమైన నాణేలు, నగదు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించారు. అయినా స్పందన లేకపోవడంతో గత నెల 23న పట్టణ పోలీసులకు ఏటీఓ సయ్యద్ అమీనుద్దీన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

స్ట్రాంగ్‌రూంకే కన్నం..

ట్రెజరీలోని స్ట్రాంగ్ రూంపై అదే శాఖలో పనిచేస్తున్న అటెండర్ విష్ణువర్దన్‌రెడ్డి కన్నుపడింది. 2021 సెప్టెంబరు1న పుల్లంపేట తహసీల్దార్‌కు లభ్యమైన పాత నాణేలు ట్రెజరీలో డిపాజిట్ చేశారు. అలాగే 2024 మే 17న ఓబులవారిపల్లె సబ్‌ఇన్‌స్పెక్టర్ రూ.12వేలు ఒక చిన్నబాక్సులో ఉంచి డిపాజిట్ చేశారు. అదను చూసి స్ట్రాంగ్‌రూంలోని పాతకాలం నాణేలతోపాటు బాక్సులో ఉన్న రూ.12వేలను దొంగిలించారు. ఈనెల 21న ఓబులవారిపల్లె పోలీసు ఒకరు ట్రెజరీలో డిపాజిట్ చేసిన డబ్బును తీసుకునేందుకు స్ట్రాంగ్‌రూంను తెరిచారు. నాణేల బాక్స్ సీల్ పగులగొట్టినట్లు కనిపించింది. దీంతో అటెండర్ చేసిన దొంగతనం వెలుగు చూసింది.

అటెండర్ ఎఫెక్ట్.. నలుగురిపై సస్పెన్షన్ వేటు

ట్రెజరీలో అటెండర్ చేసిన నిర్వాకం కారణంగా నలుగురిపై సస్పెన్షన్ వేటు పడింది. ఏటీఓ అమీనుద్దీన్, ఎస్‌టీఓ రమేష్‌రెడ్డి, షరాబు మురళీమోహన్‌తో పాటు అటెండర్ విష్ణువర్దన్‌రెడ్డిని కూడా సస్పెండ్ చేశారు. దీంతో ప్రస్తుతం రాయచోటి ఏటీఓ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. ఏటీఓగా ఖాదరవలీని నియమించారని ట్రెజరీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎట్టకేలకు అటెండర్ అరెస్టు..

బంగారు నాణేల దొంగతనం కేసులో సోమవారం అటెండర్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 20.800 గ్రాముల పురాతన బంగారు నాణేలను స్వాధీనం చేసుకున్నారు. రూ.12వేల నగదు సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయాన్ని డీఎస్పీ సుధాకర్ మీడియాకు వెల్లడించారు.

సమావేశాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న తిమ్మాపురం గ్రామ సమాఖ్య సభ్యులు

రాయచోటి అర్బన్ : కె.వి.పల్లె మండలం తిమ్మాపురం గ్రామం వెలుగు సంఘం గ్రామ సమాఖ్య సమావేశం జరగకుండా అడ్డుకుంటున్న రాజకీయ నేతలపై చర్యలు తీసుకోవాలని పీలేరు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్.వెంకటేష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిమ్మాపురం గ్రామ సమాఖ్య సభ్యులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామంలో 40 పొదుపు సంఘాలలో 400 మంది సభ్యులు ఉన్నారన్నారు. కాగా వెలుగు సంఘాల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే విధంగా కేవీపల్లె మండల అధికార పార్టీ నేతలు సమావేశం జరగనివ్వకుండా అధికారులను భయపెడుతున్నారని ఆరోపించారు.

లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కొండయ్య

రాయచోటి అర్బన్ : లింగ నిర్ధారణ చట్టాన్ని ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల యాజమాన్యంపై కఠిన చర్యలు తప్పవని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ కొండయ్య అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని స్కానింగ్ సెంటర్‌ల ప్రతినిధులకు కె.రామాపురం అర్బన్ పీహెచ్‌సీలో ఒక్కరోజు సెన్సిటైజేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ, నిబంధనల మేరకు ప్రతిస్కాన్ సెంటర్ యాజమాన్యం జిల్లా అథారిటీ వద్ద తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రతిస్కానింగ్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయబడవు అనే ఫ్లెక్సీలను బాగా కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి మాట్లాడుతూ ఫారం- ఎఫ్‌లు సక్రమంగా పంపని వారికి నోటీసులు ఇచ్చి, జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ రియాజ్‌బేగ్, హెల్త్ ఎడ్యుకేటర్స్ ఉషారాణి, రాజగోపాల్, పలువురు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆంధ్రా రంజీ జట్టుకు రఫీ


ఎస్ఎండీ రఫీ

కడప స్పోర్ట్స్ : కడప నగరానికి చెందిన ఎస్. మహమ్మద్ రఫీకి ఆంధ్రా రంజీ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం లభించింది. సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు అనంతపురం జిల్లా ఆర్‌డీటీలో నిర్వహించిన ఆంధ్రా రంజీ క్యాంపు అనంతరం రంజీ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా జట్టును ప్రకటించగా అందులో రఫీ అవకాశం దక్కించుకున్నాడు. రైట్ ఆర్మ్ ఫాస్ట్‌బౌలర్‌గా రాణించడంతో పాటు బ్యాటింగ్‌తో సైతం సత్తా చాటగల ఆల్‌రౌండర్ కావడంతో సెలెక్టర్‌లు ఆంధ్రా జట్టుకు ఈయనను ఎంపిక చేశారు. కడప నగరానికి చెందిన సిరాజుద్దీన్ దౌలా (ఆర్ఎస్ఐ), ఫాతిమున్నీసా దంపతుల కుమారుడైన రఫీ.. అండర్–12 నుంచి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చాడు. అండర్–14, అండర్–16, అండర్–19, అండర్–23, సీనియర్స్ ఇలా అన్ని విభాగాల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. కాగా గతంలో సైతం రంజీ పోటీల్లో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించి 14 వికెట్లు తీశాడు.

సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలి


జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : తమ 22 రోజుల సమ్మెకాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలంటూ సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సమగ్రశిక్ష అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు క్రమం తప్పకుండా జీతాలిస్తున్న అధికారులు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం సమంజసం కాదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ చిరుద్యోగులైన ఎస్ఎస్ఏ ఉద్యోగుల పట్ల ఉన్నతాధికారులు వివక్షత చూపడాన్ని సహించబోమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కార్యదర్శి అలీహుస్సేన్, సభ్యులు ప్రదీప్‌గుప్తా, నరేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ వర్గీయుల దాడి


దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితురాలు శ్రావణి


హత్యాయత్నానికి గురైన బాధితురాలు శ్రావణి ని పరామర్శిస్తున్న వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు కక్ష
- కరెంట్ తీసేసి మరీ కత్తితో దాడి
- తీవ్రంగా గాయపడిన మహిళ
- కేసు నమోదు చేయని పోలీసులు

మదనపల్లె : ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికినందుకు ఓ మహిళపై కత్తితో విచక్షణారహితంగా దాడిచేశారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లాలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితురాలు శ్రావణి భర్త హరి కథనం మేరకు వివరిలా ఉన్నాయి.

అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలంలోని వలసపల్లె పంచాయతీ అరవవాండ్ల పల్లెకు చెందిన హరి, శ్రావణి దంపతులు. వీరు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు. వీరికి రెండెకరాల డీకేటీ భూమికి సంబంధించి గ్రామంలోని టీడీపీ వర్గీయులైన తమ దాయాదులతో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో టీడీపీకి అనుకూలంగా పనిచేయాలని, లేకుంటే కూటమి ప్రభుత్వం ఏర్పడినాక ఇబ్బందులు తప్పవని వారు హెచ్చరించారు. అయినా హరి, శ్రావణి వారి మాట వినలేదు. ఈ క్రమంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని తరచూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఆదివారం రాత్రి టీడీపీ నాయకుల సూచనతో గంట పాటు గ్రామంలో కరెంటు లేకుండా చేశారు. ఇదే సమయంలో శ్రావణి పాలు పితికి ఇంటిలోకి తీసుకొస్తుండగా.. నిందితులు పూల పాపయ్య, నారాయణమ్మ, పెద్ద లక్ష్మి దాడికి పాల్పడ్డారు. దాడిలో కోడి కత్తి తో తీవ్రంగా గాయపరిచారు. ఘటనలో శ్రావణి ముఖం, వెనకవైపు మెడ భాగంలోను, శరీరంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్సలో భాగంగా 32 కుట్లు వేశారన్నారు. మెడ వెనక వైపున నరం తెగిపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి తీసుకువెళ్లాలని స్థానిక వైద్యులు సూచించారు. ఘటనపై శ్రావణి తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసినా, నిందితులపై చర్యలు తీసుకోలేదు. కేసు నమోదు చేయలేదు. కాగా, . ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రావణిని సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ మదనపల్లె నియోజకవర్గం సమన్వయకర్త నిసార్ అహ్మద్ పరామర్శించారు. వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ వర్గీయులు హత్యాయత్నానికి పాల్పడటంపై జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని నిసార్ అహ్మద్ కోరారు. అలాగే టీడీపీ వర్గీయులు చేస్తున్న దాడులను అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించాలన్నారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలం వెల్లటూరు రాజీవ్ నగర్ గ్రామానికి చెందిన పార్ల పుల్లారెడ్డి(57) అనే రైతు సోమవారం అప్పుల బాధ తాళలేక విషపు ద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. పుల్లారెడ్డి అప్పులు ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై ఇంట్లో పురుగుల మందుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు హూటా హుటిన కడప ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి 3 ఎకరాల పొలం ఉంది. బోర్లకు, పంటల సాగుకు, కుమార్తె పెళ్లికి దాదాపు రూ.20లక్షల పైగా అప్పులు అయ్యాయి. అప్పుల బాధతో విష ద్రావణం తాగాడు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గదులు కేటాయించకుంటే విధులు ఎలా నిర్వహించాలి

మెడికల్ కాలేజీ ఉద్యోగుల నిరసన


నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేస్తున్న మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగులు

మదనపల్లె : గదులు కేటాయించకుంటే విధులు ఎలా నిర్వహించాలని, 16 మంది సిబ్బందికి ఒకే గది ఇస్తే ఉద్యోగాలు ఎలా చేయాలంటూ ప్రశ్నిస్తూ మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగులు, ఏడీ నగేష్ కుమార్, ఏవో, (హెచ్ఏఎంఎస్ఏ) మదనపల్లి డివిజన్ అధ్యక్షుడు పుల్లమరాజు ఆధ్వర్యంలో తమకు కేటాయించిన గదుల ముందు నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మదనపల్లి ప్రభుత్వ సర్వజన బోధన ఆసుపత్రిలో మెడికల్ కాలేజీ ఉద్యోగులు ఈమేరకు వాపోయారు. అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, 8 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్, నలుగురు లైబ్రరీ అసిస్టెంట్స్, పీఎం అసిస్టెంట్ తో కలిపి 16 మంది ఒకే గదిలో విధులు నిర్వహిస్తున్నామన్నారు. పైగా అదే గదిలో జీజీహెచ్ కు సంబంధించిన జనన, మరణాల సర్టిఫికెట్ల నమోదు, జారీ ఇక్కడి నుంచి జరుగుతుండడంతో నిత్యం రద్దీగా ఉంటూ విధులకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఆఫీస్ గదిలో అవసరమైన టేబుళ్లు, కుర్చీలు సైతం తామే సొంతంగా తెచ్చుకుంటున్నామన్నారు. సమస్యను మెడికల్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఈ విషయమై మెడికల్ సూపరింటెండెంట్ ఎమ్మెస్ రాజును వివరణ కోరగా, ఆస్పత్రి మొదటి అంతస్తులోని గదులను మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ విభాగానికి కేటాయించామన్నారు. అయితే ఇటీవల వర్షాలకు ఆ గదులు ఉరుస్తుండడంతో, ఏపీ ఎండీసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు మరమ్మతు చేస్తున్నారని ఈనెల 15వ తేదీలోగా భవనాలు అప్పగిస్తారన్నారు.

వాల్మీకులు, బోయలపై వివక్ష ఇంకెన్నాళ్లు?



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవీబీఎస్ నాయకులు

మదనపల్లె : ఆంధ్ర రాష్ట్రంలో వాల్మీకి బోయలపై వివక్ష ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారని, వెంటనే మైదాన ప్రాంత వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నాగినేని గోవిందు, యూత్ విభాగం అధ్యక్షుడు మహేష్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి బొమ్మనపల్లి లక్ష్మన్న అన్నారు. సోమవారం మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వాల్మీకుల ఐక్యత చాటుతూ ఈనెల 17వ తేదీన శ్రీ మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు గ్రామ గ్రామాన వాల్మీకి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా బోయ కొండ గంగమ్మ దేవస్థానం ఆలయ చైర్మన్ పదవి వాల్మీకి బోయలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో వాల్మీకి బోయలు కూటమి వైపు అండగా నిలిచి ఓట్లు వేశారని, కూటమి ప్రభుత్వం తమను నట్టేట ముంచవద్దని కోరారు. గిరిజన రిజర్వేషన్ల అంశంలో ఏ జాతికి లేని అశాస్త్రీయమైన ఏజెన్సీ, మైదాన ప్రాంతం అనే నిబంధన వాల్మీకి బోయల రిజర్వేషన్ల అమలులో మాత్రం ఎందుకని ప్రశ్నించారు. వాల్మీకుల రిజర్వేషన్ల అంశంలో రాజ్యాంగాన్ని అనుసరించి అధికరణలు 14,15,16 , 29(1) 342లను అమలు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.మల్లికార్జున, పరేసు గోపాల్, రాజగోపాల్, చెన్నం వెంకటరమణ, కొత్తూరు చిన్న రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.